మంత్రి సత్యకుమార్‌తో 'పురం' మెప్మా ఆర్‌పిలు, తదితరులు

బకాయి వేతనాలు చెల్లించాలి

మంత్రికి శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికుల వినతి

ప్రజాశక్తి-హిందూపురం

8 నెలలుగా బకాయి పడ్డ వేతనాలను చెల్లించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు శ్రీరామిరెడ్డి నీటి సరఫరా విభాగం కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి నీటి సరఫరా విభాగం కార్మికులు మంత్రిని కలిసి వారి సమస్యలను వివరించారు. వేతనాలతో పాటు 23 నెలల నుంచి పిఎఫ్ డబ్బులు సంస్థ చెల్లించడం లేదని వివరించారు. అలాగే పురపాలక సంఘంలోని మెప్మా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌పిలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారికి ఇచ్చే గౌరవ వేతనాలను నేరుగా వారి ఖాతాలో జమ చేసేలా చూడాలని కోరారు. స్పందించిన మంత్రి ఆయా శాఖల అధికారులతో చర్చించి, సమస్యలను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి కార్మిక సంఘం నాయకులు నాగేంద్ర, నాయకులు రవితేజారెడ్డి, బాలగోపాల్, సునీల్, జయకృష్ణ, రాజు, వినయ్, ఆర్‌పి నాగలక్ష్మి, రాధిక, సుజాత, జయలక్ష్మి, బంతి లత, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ అక్రమ దందాపై చర్యలుండేనా..?

- గత ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా కొనసాగిన రవాణా...
- అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటున్న అధికారపార్టీ నేతలు
- ప్రస్తుత ప్రభుత్వ చర్యలు ఎలా ఉంటాయన్నదానిపై చర్చ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కర్నాటక సరిహద్దుల నుంచి అనంతపురం జిల్లాలోకి డీజల్ అక్రమ రవాణా దందా జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగింది. అనేక మార్లు పట్టుబడిన దాఖలాలూ ఉన్నాయి. ఇప్పుడు ఆ రకంగా దొంగ వ్యాపారం చేసిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని అధికార టిడిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటీవల బాహాటంగానే ఆరోపించడమే కాకుండా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. తన నియోజకవర్గం పరిధిలో ఒక పెట్రోల్ బంకులో రోజుకు 40 వేల వరకు అక్రమంగా కర్నాటక నుంచి తెచ్చిన డీజల్ అమ్మకం ద్వారా కొంత మంది సొమ్ము చేసుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం గమనార్హం. గతంలో ప్రతిపక్షంలో ఉండగానే రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కూడా ఇదే రకమైన ఆరోపణలు చేశారు. జిల్లాలోకి కర్నాటక నుంచి డీజల్ అక్రమ రవాణా దందా సాగుతోందని ఆరోపించారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం డీజల్ అక్రమ దందాపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటుందా అన్న చర్చ నడుస్తోంది.

ధర వ్యత్యాసంతో లక్ష లీటర్లకుపైగా అక్రమంగా వ్యాపారం

ఆంధ్రప్రదేశ్‌కు కర్నాటకకు డీజల్ ధరలో లీటరుపై రూ.11.25 ధర వ్యత్యాసం ఉంది. దీంతో అక్కడి నుంచి ఇక్కడికి తీసుకు వచ్చి అమ్ముకోవడం ద్వారా లీటరుపై రూ.11.25లు మిగులుంటుంది. నిబంధనల ప్రకారం పక్క రాష్ట్రం నుంచి పెద్ద మొత్తంలో డీజల్ తీసుకొని వచ్చి బయట అమ్మడానికి వీల్లేదు. ఎందుకంటే ఈ రకంగా అమ్మడం ద్వారా ఇక్కడ ప్రభుత్వానికి పన్ను రూపంలో రావాల్సిన ఆదాయం రాకుండా పోతుంది. ఈ రకంగా అమ్మిన వారిపై వాణిజ్య పన్నుల శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కాని గడిచిన మూడునాలుగేళ్లుగా ఏకంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీనే కోట్ల రూపాయల్లో అక్రమంగా దిగుమతి అయిన డీజల్ కొనుగోలు చేసింది. అది అప్పటి అధికారపార్టీ నేతల ప్రమేయంతోనే సాగింది. కాని వాణిజ్య పన్నుల శాఖగాని, ఇతర అధికారులుగాని ఏ మాత్రం చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఒకటి,రెండు కేసులు మాత్రమే నమోదు చేసిన ఘటనలున్నాయి. ఒక దగ్గర రూ.30 లక్షల వరకు జరిమానా విధించారు. పుట్లూరు మండలంలో నేరుగా వాహనాలనూ పట్టుబడిన దాఖలాలున్నాయి.

ప్రభుత్వం చర్యలు తీసుకునేనా ?

ప్రభుత్వం డీజల్ వ్యాపారంలో భాగస్వామ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని జెసి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేయడమే కాకుండా ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై విచారణ కొనసాగుతుందా లేక ఫిర్యాదుతోనే ముగుస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని గుండుమల గ్రామంలో సిఎం చంద్రబాబు నిర్వహించే పర్యటన ఏర్పాట్లను మంత్రి సవిత ఆదివారం పరిశీలించారు. గ్రామంలో హెలిపాడ్ సభా స్థలం, పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు అంజనప్ప, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, తదితరులు

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

మంత్రి ఎస్. సవిత

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సమిష్టిగా, సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దామని రాష్ట్ర బీసీ చేనేత సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ టిఎస్ చేతన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు పుట్టపర్తి, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జిల్లా ఎస్పీ వి.రత్న, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత మొదటిసారి జిల్లా పర్యటనకు ఆగస్టు 1న వస్తున్నారని ఈ మేరకు ఆయన మడకశిర నియోజకవర్గంలో గ్రామసభలో పాల్గొంటారని అన్నారు. అధికారులందరూ ఈ పర్యటనను విజయవంతం చేయాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. మడకశిర నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే చంద్రబాబుకు ఇష్టమని ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేయూతను ఇస్తారని అన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలోని సమస్యలను ముఖ్యమంత్రి దష్టికి తెస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి చంద్రబాబు జిల్లాను అన్ని విధాల అభివృద్ధిలోకి తెస్తారని అన్నారు. మడకశిరలో నిరుపయోగంగా ఉన్న అతిథిగృహన్ని రెండు రోజుల్లోపు అందుబాటులోకి తేవాలని ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకట శివ సాయి రెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 1న నిర్వహించే జిల్లా పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ తో పాటు ఎస్ పి వి.రత్న, డిఆర్ఒ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 1న మడకశిర నియోజకవర్గం లోని గుండుమలలో నిర్వహించే ప్రజావేదికలో ముఖ్యమంత్రి పాల్గొని పింఛన్ల పంపిణీ చేస్తారన్నారు. ప్రజా వేదికలో లబ్ధిదారులు ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. హెలిప్యాడ్ వద్ద తగు ఏర్పాట్లు చేపట్టాలని అంబులెన్స్, ఫైర్ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు సంక్షేమం, అభివృద్ధి పనులపై తగిన నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. మడకశిర నియోజకవర్గంలో అభివద్ధికి సంబంధించి నివేదికలతో సంబంధిత అధికారులు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎస్‌పి వి. రత్న మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు భాగ్యరేఖ, వెంకట శివ సాయి రెడ్డి, వంశీకృష్ణ, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డ్వామా పిడి విజయేంద్రప్రసాద్, పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్ తదితర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

'పురం' మున్సిపాలిటీలో..

కోల్డ్‌వార్..!

హిందూపురపాలక సంఘంలో ఇంజనీరింగ్, అకౌంటెడ్ సెక్షన్ అధికారుల మధ్య సమన్వయం లోపించడం, మున్సిపల్ నిధుల దుర్వినియోగంతో కార్యాలయంలో గత వారం రోజుల నుంచి కోల్డ్‌వార్ జరుగుతోంది. కట్టడి చేయాల్సిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులపై ఫిర్యాదు చేస్తోంది. ఇక మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణలు తీసుకోవటానికి పరిమితమయ్యారు. ఇలా పురపాలక సంఘంలో అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో పాలన మొత్తం అస్తవ్యస్తంగా తయారయింది.

ప్రజాశక్తి-హిందూపురం

అధికారుల మధ్య సమన్వయ లోపం..

షోకాజ్ నోటీసులతో సరిపెడుతున్న కమిషనర్

రాష్ట్రంలోనే హిందూపురం పురపాలక సంఘానికి మంచి గుర్తింపు ఉంది. ఆ గుర్తింపు ఉండడంతో ఈ పురపాలక సంఘంలో విధులు నిర్వహించడానికి కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన వారు సైతం హిందూపురం పురపాలక సంఘాన్ని ఎంపిక చేసుకుని వస్తుంటారు. ఇంత పేరుగాంచిన హిందూపురం పురపాలక సంఘం కార్యాలయంలో గత కొన్ని నెలలుగా అకౌంటెంట్, ఇంజనీరింగ్ విభాగం అధికారుల మధ్య సమన్వయం లోపించి కోల్డ్‌వార్ మొదలయింది. ఇది మొత్తం కార్యాలయానికి పాకింది. తొలత పురపాలక సంఘంలో చేపట్టిన అభివృద్ధి, ఇతర పనులకు సంబంధించిన బిల్లులను పురపాలక శాఖ నిబంధనల మేరకు సిఎఫ్ఎంఎస్ లోనే చెల్లించాల్సి ఉంది. అయితే అకౌంటెంట్‌కు అనుకూలంగా ఉన్న వారందరికీ సిఎఫ్ఎంఎస్ లో కాకుండా నేరుగా చెక్కుల రూపంలో బిల్లుల చెల్లింపులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఇంజనీరింగ్ విభాగం అధికారులు వారికి అనుకూలంగా ఉన్న వారికి సైతం చెక్కుల రూపంలో బిల్లులు చెల్లింపులు చేపట్టాలని అకౌంటెంట్ పై ఒత్తిడి తెచ్చారు. అకౌంటెంట్ చెక్కుల రూపంలో చెల్లింపు చేయడం లేదని సిఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లిస్తామని తెగేసి చెప్పడంతో ఈ రెండు సెక్షన్ల మధ్య కోల్డ్‌వార్ ప్రారంభమైంది. ఈ రెండు సెక్షన్ల మధ్య ప్రారంభమైన ఇది ఇతర సెక్షన్లకు సైతం పాకింది. నిధుల దుర్వినియోగం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ ఉన్నతాధికారులతో పాటు అవినీతి నిరోధక శాఖ అధికారులకు సైతం ఫిర్యాదు చేసింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఫిర్యాదులు చేయడం వెనుక ఇంజనీరింగ్ విభాగంలోని డిఇ స్థాయి అధికారి కీలకపాత్ర పోషించాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది తెలుసుకున్న ఇతర అధికారులు ఆ అధికారిని ఎలాగైనా కట్టడి చేయాలని వ్యూహ రచన చేశారు. అందులో భాగంగా డిఇపై ఎమ్మెల్యే కార్యాలయానికి ఫిర్యాదు చేయించారు. ఆ అధికారి వైసీపీ మద్దతు దారుడని ఫిర్యాదు చేయించారు. దీంతో పాటు అకౌంట్ సెక్షన్ లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగినితో సైతం ఫిర్యాదు చేయించారు. 2021లో అప్పటి హిందూపురం రూరల్ ఎంపీపీ కుమార్తె పురపాలక సంఘంలో ఆప్కాస్ విధానంలో పనిచేస్తున్నది. ఈమెను భయభ్రాంతులకు గురిచేసి ఈమె స్థానంలో ఎటువంటి కౌన్సిల్ ఆమోదం లేకుండానే అకౌంట్ సెక్షన్ లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగినిని అప్పట్లో నియమించినట్లు సమాచారం. ఆ ఉద్యోగిని ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎటువంటి ఉత్తర్వులు లేకుండానే అకౌంటెంట్ సెక్షన్ లో విధులు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో అకౌంట్ సెక్షన్ అధికారులు ఈ ఉద్యోగినిని తమకు అనుకూలంగా మలచుకుని డీఈపై ప్రయోగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాలన్నింటినీ చక్కదిద్దాల్సిన మున్సిపల్ కమిషనర్ డీఈతో పాటు ఇంజనీరింగ్ సెక్షన్ క్లర్క్ కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో డీఈ కి రెండు నోటీసులు ఇచ్చి వివరణ అడిగారు. సెక్షన్ క్లర్క్‌కు అకౌంట్ సెక్షన్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినికి సకాలంలో వేతనాలు ఎందుకు చేయలేదని నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇలా అధికారుల మధ్య సమన్వయ లోపంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అవినీతిపై సమగ్ర విచారణ జరిపించడంతో పాటు అధికారులను సమన్వయం చేస్తే తప్ప పాలన పట్టాలెక్కే పరిస్థితి కనిపించడం లేదు. దీనిని ఇలాగే వదిలేస్తే ఒకరిపై ఒకరు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ఇంతదాకా వెళ్లకముందే మున్సిపల్ ఉన్నతాధికారులు హిందూపురం పురపాలక సంఘంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

హిందూపురం మున్సిపల్ కార్యాలయం

మహిళాభివృద్ధే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ధ్యేయం

ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో బాలల హక్కులు, మహిళాభివృద్ధి, పౌష్టికాహారం సరఫరా విషయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అన్ని చర్యలు చేపడుతోందని ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి వివరాలు ?

జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో 2207 మెయిన్ అంగన్వాడీ, 617 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఆరు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలు 1,05,447 మంది, 23,441 మంది గర్భిణులు, బాలింతలకు కేంద్రాల ద్వారా పౌష్టికాహారం ప్రతినెలా అందిస్తున్నాం.

ప్ర : పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జ : జిల్లా వ్యాప్తంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం నెల నెల సక్రమంగా అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంపిణీ విషయంలో క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎవరైనా లబ్ధిదారుల నుండి పౌష్టికాహారం అందించడం లేదనిఫిర్యాదులు అందితే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తపై అభియోగాలు వస్తే తొలుత మెమోలు జారీ చేసి అనంతరం వారిపై చర్యలు తీసుకుంటాం.

ప్ర : అంగన్వాడీ కార్యకర్తలపై వస్తున్న రాజకీయ వత్తిళ్లపై మీ అభిప్రాయం ?

జ : ఇటీవల జిల్లాలో కొన్నిచోట్ల అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ ఒత్తిళ్లువస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమంది రాజకీయ నాయకులు తెలియనితనంతో అంగన్వాడీ కార్యకర్తలను ,ఆయాలని తొలగించాలని సంబంధిత అధికారులకు ఒత్తిళ్లు తెస్తున్నారు. అయితే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను తొలగించే ఆస్కారం లేదు. వారి విధులు సక్రమంగా నిర్వహించక పోయినా పౌష్టికాహారం అందించడంలో అలసత్వం వహించినా, సక్రమంగా అందించలేదని ఫిర్యాదులు వచ్చినా విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. అంతేకానీ అనవసరంగా రాజకీయ నాయకుల ప్రోద్బలంతో వారిని ఇబ్బందులకు గురి చెయ్యం.

ప్ర : జిల్లాలో అంగన్వాడి కేంద్రాలను ఆధునీకరిస్తారా?

జ : జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఇదివరకే కొన్నింటిని ఆధునీకరించాం. గత ప్రభుత్వంలో సొంతభవనాలు లేని వాటికి నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటిలో కొన్ని గ్రామాల్లో నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. అంగన్వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించేందుకు, కేంద్రాలను మరమ్మతులు నిర్వహించేందుకు నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించి, కేంద్రాలు సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఐసిడిఎస్ పీడీ నాగమల్లేశ్వరి

ఆర్‌ఎంపిలు సూది మందు వేస్తే చర్యలు

అవగాహన సదస్సులో వైద్యాధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

ఆర్‌ఎంపి వైద్యులు వైద్యం చేసి రోగి అనర్థాలకు కారకులైతే చర్యలు తప్పవని వైద్యాధికారులు హెచ్చరించారు. పట్టణంలోని అల్ హిలాల్ పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లా వైద్యాధికారులు ఆర్‌ఎంపి వైద్యులకు వారు అందించే చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారులు పద్మజ, డిఎంహెచ్ఒ డిమో సెక్షన్ అధికారి బాబాఫకృద్దీన్, డాక్టర్ మాధుర్య మాట్లాడుతూ ఆర్‌ఎంపి వైద్యుల వద్దకు వచ్చే రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, యాంటీబయోటిక్స్ మందులను అనవసరంగా ఇవ్వరాదన్నారు. యాంటీబయోటిక్స్ మందులను స్థాయికి మించి ఇస్తే అవి రియాక్షన్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌ఎంపి వైద్యులు పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అత్యవసర సేవల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు గాని ఇతర అర్హత, ప్రమాణాలు కలిగిన ఆసుపత్రులకు వెళ్లే విధంగా వారికి సలహాలివ్వాలని సూచించారు. జిల్లాలోని కొక్కంటి ప్రాంతంలో ఓ వైద్యుడు సూది మందు ఇవ్వడం వల్ల అది రియాక్షన్ అయ్యి ఓ మహిళ మృతి చెందిందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. క్లినిక్, చిన్న పిల్లలకు ప్రత్యేకంగా చూడబడును అనే బోర్డులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. వైద్య సేవలు నిర్వహించే చోట ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే బోర్డు ఉండాలాన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో బెడ్లు, సెలైన్ బాటిల్స్‌తో పాటు స్టాండ్లు, బెడ్లు, మంచాలు ఉండకూడదన్నారు, ఇంజెక్షన్స్ వేయరాదని, ప్రసవం, అబార్షన్లు చేయకూడదని, ల్యాబ్ పరీక్షలు నిర్వహించకూడదని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమించి వైద్య సేవలు అందిస్తే క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. ఆర్‌ఎంపి వైద్యుల సంఘం అధ్యక్షులు గోవిందరాజులు, ఆంజనేయులు, ఏసురత్నం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ముస్తఫా, రమేష్, మల్లప్ప, ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు కార్యాలయ ఆవరణలో సమావేశమైన స్వీపర్లు

స్వీపర్లకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్ ఎల్.ఆదినారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణం లోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం స్వీపర్లకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. వారు మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 20 ఏళ్లుగా స్వీపర్స్‌గా పని చేస్తున్నా ఇప్పటికీ వేతనం కేవలం రూ. 4వేలు ఇస్తున్నారన్నారు. చాలీచాలని వేతనాలతో వారి కుటుంబాల పోషణ చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వం ఇస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. ఇకనైనా వారి కుటుంబాల ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో స్వీపర్స్ సంఘం నాయకురాళ్లు జయమ్మ, చౌడమ్మ, ముంతాజ్, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సింధూర

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కలెక్టర్ చేతన్‌కు పూలబొకే అందజేస్తున్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథ్ రెడ్డి

ఇటీవల పుట్టపర్తిలో కలెక్టర్ అధ్యక్షతన మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా పేద గర్భిణుల సమస్యలను ఏకరువు పెట్టారు. అల్ట్రాసౌండ్ మెషిన్ ఏర్పాటు చేయాలని కోరారు. చిత్రావతి నదిలో మురుగునీరు కలుషితం, రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు, పుట్టపర్తి డిపోకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సుల ఏర్పాటు తదితర సమస్యలను మంత్రులతో పాటు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. వాటిలో పలు సమస్యలకు కలెక్టర్ టిఎస్.చేతన్ పరిష్కారం చూపారు. దీంతో ఆదివారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కలెక్టరేట్ వెళ్లి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్‌ను కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పేదలకు కంటిచూపు ప్రసాదించడం అభినందనీయం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేదలకు కంటి చూపు ప్రసాదించడం ఓ వరమని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హెచ్ఎం శైలజ, విశిష్ట అతిథిగా మార్కండేయులు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. లయన్స్ క్లబ్ 40 ఏళ్ల నుంచి ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు కంటి చూపు ప్రసాదించడం అభినందనీయమన్నారు. శిబిరంలో 92 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 55 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు తెలిపారు. శిబిరంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి రమేశ్, కోశాధికారి నాగేంద్ర, ప్రతినిధులు గోసే రాధాక్రిష్ణ, మెటికల కుళ్లాయప్ప, రాజగోపాల్, పల్లెం వేణుగోపాల్, మోహ న్‌దాస్, కొత్త శ్రీరాములు, చందా నాగరాజు, పుట్లూరు నరసింహులు, వెంకటేశ్, కుమార్ పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో మూర్ఛ వైద్య శిబిరం

శిబిరంలో చికిత్స చేస్తున్న డాక్టర్ నీలేఖ్య

పెనుకొండ : జన విజ్ఞాన వేదిక(జెవివి) పెనుకొండ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఘన గిరి స్కూల్ లో మూర్ఛ వ్యాధిగ్రస్తులకు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 45 మంది వ్యాధిగ్రస్తుల కు డాక్టర్ నీలేఖ్య వైద్య పరీక్షలు చేశారు. రెండు నెలలకోసారి 4వ ఆదివారం వైద్య శిబిరం నిర్వహిస్తా మని నిర్వాహకులు తెలిపారు. వ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెవివి జిల్లా కార్యదర్శి హరి సూచించారు. శిబిరంలో ఘనగిరి స్కూల్ కరస్పాండెంట్ ఇలియాజ్, పెనుకొండ జోన్ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్, సభ్యులు రమేష్, రామన్న, బాబావలి, నాగార్జున, రవి, యశ్వంత్, తదిత రులు పాల్గొన్నారు.

1న చంద్రబాబు పర్యటన జయప్రదం చేయండి

గుడిబండ : సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆగస్టు 1వ తేదీ మడకశిర మండలంలోని గుండుమల గ్రామం వస్తున్నారని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. చంద్రబాబు పర్యటనకు నియోజకవర్గంలోని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు వీరశైవ లింగాయత్ జిల్లా అధ్యక్షులు దుర్గేష్, శివకుమార్, శశిధర్ ఉన్నారు.

గ్రామాల్లో జలధికి తరలిన పీర్లు

పుట్టపర్తి రూరల్ : మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పీర్లు జలధికి తరలి వెళ్లాయి. యనమలపల్లి, కర్నాటక నాగేపల్లి, చెర్లోపల్లి, జగరాజుపల్లి, రాచువారిపల్లి, బత్తలపల్లి గ్రామాల్లో హిందూ, ముస్లింలు భక్తిశ్రద్ధలతో పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు అధిక సంఖ్యలో అగ్నిగుండాల చుట్టూ నృత్యాలు చేశారు. అనంతరం గ్రామంలో పీర్ల స్వాములను ఊరేగించ గా ప్రజలు మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లో పీర్లను జలధికి తరలించారు.

బదిలీ తహశీల్దార్‌కు సన్మానం

పరిగి : ఎన్నికల విధుల్లో భాగంగా తహశీల్దార్‌గా ఆరు నెలల పాటు బాధ్యతలు నిర్వహించడం సంతృప్తి ఇచ్చిందని తహశీల్దార్ రాజేశ్వరి ఆశాభావం వ్యక్తం చేశారు. బదిలీ తహశీల్దార్‌ను ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి సమస్యలు చోటు చేసుకోకుండా సజావుగా నిర్వహించేందుకు సహకరించిన స్థానిక రెవెన్యూ అధికార బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. పరిగి తహశీల్దార్‌గా పని చేసి బదిలీపై కర్నూలు జిల్లాకు బదిలీ అయినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుత కాలంలో రెవెన్యూ వ్యవస్థకు పూర్వ వైభవం రావాలని, ఆ దిశగా రెవెన్యూ అధికారులు పని చేయాలని వెల్లడించారు. ప్రభుత్వ వ్యవస్థల్లో రెవెన్యూ శాఖ పాత్ర కీలకం అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగిలో గతంలో తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన సౌజన్యలక్ష్మితో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తహశీల్దార్ రాజేశ్వరిని సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-హిందూపురం

మొక్కలు పంపిణీ చేస్తున్న పర్యావరణ వేత్తలు

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుకుదాం అని పర్యావరణ వేత్తలు పిలుపునిచ్చారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గో గ్రీన్ పేరుతో ఆదివారం పట్టణంలోని పెనుకొండ రోడ్డులో వివిధ రకాల పది వేల మొక్కలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ పర్యావరణవేత్త భాస్కర్‌నాయుడు, అటవీశాఖ అధికారి అక్బర్, ఎంఇఒ గంగప్ప, ఇన్నర్ వీల్ క్లబ్ సంస్థ అధ్యక్షులు డాక్టర్ వాణి, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ సంస్థ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫరూక్ ఖాన్ హాజరై మొక్కలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛమైన, ఆహ్లాదరకమైన వాతావరణం కోసం నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. భూ మండలంపై కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు, సమృద్ధిగా వర్షాలు కురిసేందుకు, విపత్తుల సమయంలో చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 65వ జన్మదినం పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా 65వేల మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని అన్ని సామాజిక సేవా సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పరిశ్రమల అధినేతలు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అశ్వర్థనారాయణ స్వామీజీ, పర్యావరణవేత్త డాక్టర్ శంకర్ నారాయణ, మౌలానా ఉస్మాన్ ఘనీ, మౌలానా ఇస్మాయిల్, క్రైస్తవ సంఘం నాగేందర్, సిక్కు సంఘం పల్వీందర్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షులు జమీల్, టిడిపి అధ్యక్షులు డీఈ.రమేష్, జనసేన నాయకులు నిమ్మకాయల రాములు, ఇన్నర్ వీల్ క్లబ్ సంస్థ విద్య, భువనేశ్వరి, మాస్టర్ ఫైరోజ్, చరణ్, ఉస్మాఖాన్‌తో పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.

ఘనంగా 'మైత్రి' కూటమి విజయోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అమరాపురం

వైద్యులను సన్మానిస్తున్న వైద్య ఆరోగ్య మైత్రి కూటమి సభ్యులు

వైద్య ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో 200 ఉచిత వైద్య శిబిరాలను దిగ్విజయంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో డాక్టర్ ఎస్‌డిఎన్ గుప్తా అధ్యక్షతన విజయోత్సవ వేడుకలు, వైద్యుల సన్మాన సభ నిర్వహించారు. దాదాపు 19 ఏళ్లుగా నిర్విరా మంగా 200 ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను దిగ్విజయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 180 ఉచిత వైద్య శిబిరాల్లో వైద్య సేవలందించిన డాక్టర్ జ్యోతి విజయ్ కుమార్, 80 శిబిరాల్లో పాల్గొన్న డాక్టర్ జింకా కృష్ణమోహన్, డాక్టర్ ఓంకార్ నాయక్‌తో పాటు వైద్యులు సురేంద్ర, లీల, తిప్పారెడ్డి, నాగేంద్ర కుమార్, నీరజ, ఆశాప్రభు, రాఘవేంద్ర, హనుమంత రాయప్ప, సౌమ్య సంతోష్, విమల్, అనసూయ, స్నేహ, చంద్రమౌళి, బసవరాజ్, సంతోష్, నాగేంద్రగుప్తా తదితరులను అమరాపురం వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మరాజు జైన్, ఎంఎం.శివకుమార్‌గౌడ్, డాక్టర్ బసవరాజ్‌ల సమక్షంలో ఘనంగా సన్మానించారు. అలాగే పాత్రికేయులు, వాలంటీర్లుగా సేవలందించిన యువకులను సన్మానించారు. డాక్టర్లు మాట్లాడుతూ సమాజంలో వైద్య సేవలు అందక ఎందరో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇలాంటి ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. దాదాపు 500 మంది వైద్యులు వివిధ క్యాంపుల్లో పాల్గొని 85వేల మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించిన ఘనత అమరాపురం వైద్య ఆరోగ్య మైత్రి కూటమికే దక్కిందన్నారు. ఈ ప్రాంతంలోని అనేక మంది వృద్ధులకు కంటి చూపు ప్రసాదించిన భాగ్యం కంటి వైద్య నిపుణుడు డాక్టర్ జింకా కృష్ణమోహన్, మహిళలకు ప్రతి క్యాంపులో అందుబాటులో ఉండి వైద్య సేవలందించడంతో పాటు మందులు అందించిన డాక్టర్ జ్యోతి విజయ్ కుమార్ సేవలను కొనియాడారు. మున్ముందు కూడా తమ సేవలను కొనసాగిస్తామని సర్జన్ డాక్టర్ ఓంకార్ నాయక్ తెలిపారు. అమరాపురం వాసులై బెంగళూరులో స్థిరపడి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న వైద్య ఆరోగ్య మైత్రి కూటమి సభ్యులను ఘనంగా సన్మానించారు.

హామీలు నెరవేర్చే బాధ్యత నాదే

మీ ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువను

చేనేత ఆత్మీయ సమావేశంలో మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చేనేత ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్

ఎన్నికల సమయంలో మీరు చూపిన ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువను.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే బాధ్యత నాదే అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని సిఎన్బి గార్డెన్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన చేనేత ఆత్మీయ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం వైద్యరంగంలో ఎన్నో మోసాలు చేసి అప్పుల పాలు చేసిందని, ఆ అప్పులను తీర్చి తిరిగి వైద్య రంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర నేత చిలకం మధుసూదన్‌రెడ్డి అండదండలే నా గెలుపునకు నాంది అన్నారు. మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ఆత్మీయ పలకరింపు సమావేశాలు నిర్వహిస్తున్నా నన్నారు. ఎన్‌డిఎ కూటమిలో చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తే వైసిపికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆగస్టు 15వ తేదీ లోపు కొత్త కార్యాలయం ఏర్పాటు చేస్తామని, అక్కడి నుంచి పూర్తిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల చెంతనే ఉంటూ మీ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కాగా ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన పార్టీ నాయకులు గైర్హాజరవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో నాయకులు గిర్రాజు నగేష్, అంబటి సతీష్, గోపాల్‌రెడ్డి, భక్తవత్సలనాయుడు, జింకా చంద్ర, సాకే ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

సిఅండ్ఐజి మిషన్ చర్చిలో పేరెంట్స్ డే నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని సిఅండ్ఐజి మిషన్ చర్చ్, మిషన్ కాంపౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రపంచంలోని తల్లిదండ్రులందరి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ పాస్టర్ రెవరెండ్ పి.స్టీఫెన్‌రాజు బైబిల్‌లోని సత్య వాక్యాలను వివరిస్తూ తల్లిదండ్రులను సన్మానిస్తే పిల్లలకు దీర్ఘాయుష్షు కలుగుతుందని బోధించారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రుల పట్ల భక్తి శ్రద్ధలు కలిగి, గౌరవించి, వృద్ధాప్యంలో వారికి తోడుగా ఉండాలని సూచించారు. అనంతరం అక్కడి తల్లిదండ్రులకు వారి పిల్లలు శాలువాలు, పూలమాలలు, బహుమతులతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి డాక్టర్ ఎ.నాగేంద్రకుమార్, కోశాధికారి విక్టర్ జాషువా, జాయింట్ సెక్రటరీ సాల్మన్ రాజ్, డీకెన్ సభ్యులు అరుణ్ కుమార్, దేవరాజ్, జార్జిబాబు, జాన్ ప్రసాద్, డేవిడ్, యూత్ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ట్రోఫీ, సర్టిఫికెట్లు సాధించిన మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం టౌన్ : రీజినల్ లెవెల్ అబాకస్ పోటీల్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ చూపారని మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ డైరెక్టర్ శ్రీవాణి, ఫ్రాంచైజీ చంద్రశేఖర్ తెలిపారు. తాడిపత్రిలో ఆదివారం జరిగిన పదో రీజినల్ లెవెల్ అబాకస్ పోటీల్లో ధర్మవరం మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు దివేష్, లోహిత్ ఛాంపియన్స్ ఆఫ్ ఛాంపియన్స్ సాధించగా ఫలశ్రుతి, బ్రితిక, మేఘాంష్ ఛాంపియన్స్ సాధించారన్నారు. సాయినిత్య, అజయ్, వాన్మాయి, ఆదిత్య, మోనిత్, కీర్తి, మోక్ష్యఘ్న, గౌరవ్, ఆరాధ్య, జయదీప్, మోనిష, ధన్విన్, తేజేష్, రుత్విక్ టాపర్లుగా నిలిచారన్నారు. విజేతలైన విద్యార్థులకు తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, ఎంఇఒ నాగరాజు ట్రోఫీ అందజేశారని వారు తెలిపారు.

మంత్రిని కలిసిన జిల్లా ఎస్పీ రత్న

ధర్మవరం టౌన్ : జిల్లా ఎస్పీ వి.రత్న ఆదివారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్పీ మంత్రికి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా పోలీస్ శాఖలో సమస్యలు, జిల్లాలో శాంతి భద్రతలపై చర్చించినట్లు తెలుస్తోంది.

మంత్రి సత్యకుమార్‌కు పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ రత్న

గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి

విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే రాజు

మడకశిర రూరల్ : మండలంలోని గుండుమల గ్రామంలో ఉన్న బిసి గురుకుల బాలుర పాఠశాలను ఆదివారం మంత్రి సవిత సందర్శించి కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో గురుకుల పాఠశాల భవన పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. వారి వెంట టిడిపి నాయకులు ఉన్నారు. అనంతరం మంత్రి గ్రామ సమీప పొలాల్లో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా రైతులు నాట్లు వేస్తుండగా వారి దగ్గరకు వెళ్లి కాసేపు ముచ్చటించారు. జడ్పీఎన్ఎఫ్ డివిజనల్ ఇన్‌ఛార్జి రమేష్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 25వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు మంత్రికి తెలిపారు వారి వెంట ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి నాయకులు ఉన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

చిలమత్తూరు : ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సంతేబిదనూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని దిగువపల్లితండాలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వై.అనురాధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో సర్పంచి నీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

In the Court of The Senior Civil Judge:Penukonda

I.P.No:4/2023

Between:
N.Mahesh ...Petitioner
And
G.Vikramsimha Reddy and 12 others ...Respondents

పై నెంబరు దావాలోని 6 మరియు 12వ ప్రతివాదులకు నోటీసు

To:
R6: C.Vijaya Kumar S/o C.Narayana Reddy aged 45 years, Money Lender, D.B.Colony, Hindupuram Town Mandal, Sri Sathya sai Dist.
R12: N.Gereesh S/o Late N.Lakshminarayana aged 40 years, Foultry From Singireddypalli Village, Gorantla Mandal, Sri Sathya sai Dist.

ఇందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా మిమ్ములను పై నెంబరు కేసులో ప్రతివాదులుగా ఉన్నారు. సదరి విషయం పై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు 30/07/2024వ తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరు అయి మీ వాదనలు కోర్టు వారికి తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షముందు పై నెంబరు కేసు నీ వాదిపరం తీర్మానము చేయుదురని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వై.లక్ష్మీనారాయణ,బి.కాం.,బి.ఎల్
వాదితరుపున వకీలు, పెనుకొండ

మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.NO:41/2018 in O.S.NO:103/2017

Between:
K.రామక్రిష్ణ S/o K.గంగప్ప, వ్యాపారము D.No:8/313-1 పాత మేదర వీధి, కదిరి, అనంతపురం జిల్లా (ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా) ...పిటిషనర్ డిక్రీ హోల్డర్

V/S

B.అల్లాబక్ష ఖాన్ S/o B.ఖాదర్ ఖాన్ వ్యాపారం, D.No:7/328 జౌకుపాళ్యం వీధి, కదిరి, నివాసం ప్రస్తుతం D.No:7/239 జౌకుపాళ్యం వీధి, కదిరి అనంతపురం జిల్లా. (ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా) ...రెస్పాండెంట్/జడ్జిమెంట్ డెటార్

వేలము ప్రకటన

పై E.P.లోని డిక్రీ హోల్డరు తన డిక్రీ బాపతు మొత్తం రాబట్టుటకై జడ్జిమెంటు డెటార్‌కు సంబంధించిన క్రింది షెడ్యూలు దాఖల ఆస్తులు (ఇల్లు) వేలం కోరినాడు. కోర్టు వారు 29-08-2024 తేదీన ఉదయం 10.30గంటల నుండి సాయంత్రం 5గంటలలోపు వేలము జరుపబడును. సవాలు దారులు ఎవ్వరైనా వేలములో పాల్గొని వేలం పాడవచ్చునని ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూల్

అనంతపురం జిల్లా (ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా), హిందూపురం రి.డి.(ప్రస్తుతం పుట్టపర్తి రి.డి).కదిరి సబ్ రి.డి. చేరి, కదిరి మున్సిపాలిటీ పరిధిలోని

ఇంటివివరము:-
ఇంటినెంబర్7-329 జౌకుపాళ్యం వీధి, కదిరి, తూర్పు, పడమర:37 అడుగులు లేక 11-285 మీటర్లు, ఉ.ద.: 22 అడుగుల, లేక 6-710 మీటర్లు. మొత్తం 90.44 చదరపు గజములలో ఇల్లు కట్టదాలు 37X22=814చదరపు అడుగులతో R.C.C బిల్డింగు, ఇందులోని H.S.C.No.6249, సర్వే నెంబర్ 422-2 కదిరి గ్రామంలోని ఆస్తి ఇందుకు చెక్కు బంధులు తూర్పు: చిటివేలు అబ్దులభాదర్ ఇల్లు, పడమర:బజారు, ఉత్తరము: చిట్టివేలు అబ్దుల్ ఖాదర్ ఇల్లు, దక్షణం: సిలార్ బీ ఇల్లు.

డిక్రీహోల్డరు మతింపు:రూ 3,50,000
కోర్టు అమీనా మతింపు:రూ 18,00,000
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వేలము తేదీ:29/08/2024

లింగాల లోకేశ్వర్ రెడ్డి
ఎం.ఎ.బి.యల్.
డిక్రీ హోల్డరు తరపు వకీలు, కదిరి

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కుటుంబ సభ్యులతో ఆదిశేషు(ఫైల్ ఫొటో)

మండలంలోని వెంగళమ్మచెరువు గ్రామంలో ఆదివారం ఆదిశేషు(43) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదిశేషు గ్రామంలో చికెన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉదయం బ్రాయిలర్ కోళ్లను మెషిన్‌లో వేసి శుభ్రం చేస్తున్న క్రమంలో మెషిన్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పుట్టపర్తి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద ఆదిశేషు మృతితో వారు బోరును విలపించారు. ఈ ఘటన పై పుట్టపర్తి రూరల్ పోలీ సులు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి పల్లె రఘు నాథరెడ్డి ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేలు ఆర్థికసాయం అందజేశారు. పల్లె వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

ఆదిశేషు మృతదేహానికి పూలమాల వేస్తున్న పల్లె

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ముదిగుబ్బ : మండలంలోని సంకేపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉమామహేశ్వర్‌రెడ్డి(35) ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. సంకేపల్లి గ్రామానికి చెందిన ఉమామహేశ్వర్‌రెడ్డి ఎలక్ట్రిక్ బైక్‌పై స్వగ్రామం నుంచి ముదిగుబ్బకు బయల్దేరాడు. మార్గమధ్యలోని కెజిబివి సమీపంలో అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నాడు. అతడి తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జెసిబి డ్రైవర్ అరెస్ట్

గోరంట్ల రూరల్ : అక్రమంగా ఇసుక డంప్ చేస్తున్న జెసిబి డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. మండలంలోని బూదిలి పంచాయతీలోని గంగాదేవిపల్లి పరిసర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుకను డంప్ చేసి రాత్రి వేళ ఇతర రాష్ట్రాలకి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆదివారం దాడులు చేసి జెసిబితో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్.. ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలంలోని తూమకుంట వద్ద ఆదివారం తెల్లవారుజామున రూరల్ పోలీసులు రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేశారు. అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా తూమకుంట పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు తూమకుంట గ్రామానికి చెందిన రామాంజనేయులు, అప్పలకుంట గ్రామానికి చెందిన మంజు పెన్నా నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేశారన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా నదీ పరివాహక, ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులను నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్లను సీజ్ చేస్తామన్నారు. కాపు కాచి చాకచక్యంగా ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులను సిఐ అభినందించారు.

పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

In the Court of The Senior Civil Judge:Penukonda

I.A.No:271/2022 in O.S.No:196/2014

Between:
Mirapakayala Kamalamma and others ...Petitioners/Plaintiffs
And
Puchakayala Adilakshmamma and others ...Respondents/Defendents

పై నెంబరు దావాలోని I.A.No:271/2022 లోని 22,23,25 ప్రతివాదులకు SEC 5 of లిమిటేషన్ యాక్ట్ నోటీసు

To:
R22: P.Chandrayudu Near Thasildar Office, Kothacheruvu,
R23: P.Muruli Krishna S/o P.Chandrayudu Near Thasildar Office, Kothacheruvu,
R25: P.Aruna W/o Radha Krishna Sreenivasa Degree Collage, Kadiri.

యిందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చుట లోని ఆలస్యమును మన్నించుటకు గాను I.A.No:271/2022 అర్జీని దాఖలు చేసినారు.సదరి విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు 01/08/2024వ తేది ఉదయం 10:30 గం॥లకు మీరు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు పై అర్జీని తీర్మానము చేయుదురని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

ఆర్. శ్రీకాంత్‌రెడ్డి,
అడ్వకేట్, పెనుకొండ

In the Court of The Senior Civil Judge:Penukonda

I.A.No:273/2022 in O.S.No:196/2014

Between:
Mirapakayala Kamalamma and others ...Petitioners/Plaintiffs
And
Puchakayala Adilakshmamma and others ...Respondents/Defendents

పై నెంబరు దావాలోని I.A.No:273/2022 లోని 22,23,25 ప్రతివాదులకు or 22 Rule 4 నోటీసులు

To:
R22: P.Chandrayudu Near Thasildar Office, Kothacheruvu,
R23: P.Muruli Krishna S/o P.Chandrayudu Near Thasildar Office, Kothacheruvu,
R25: P.Aruna W/o Radha Krishna Sreenivasa Degree Collage, Kadiri.

యిందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చుటకు గాను I.A.No:273/2022 అర్జీని దాఖలు చేసినారు.సదరి విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు 01/08/2024వ తేది ఉదయం 10:30 గం॥లకు మీరు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు పై అర్జీని తీర్మానము చేయుదురని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

ఆర్. శ్రీకాంత్‌రెడ్డి,
అడ్వకేట్, పెనుకొండ

In the Court of The Senior Civil Judge:Penukonda

I.A.No:272/2022 in O.S.No:196/2014

Between:
Mirapakayala Kamalamma and others ...Petitioners/Plaintiffs
And
Puchakayala Adilakshmamma and others ...Respondents/Defendents

పై నెంబరు దావాలోని I.A.No:272/2022 లోని 22,23,25 ప్రతివాదులకు or 22 Rule 9.C.P.C నోటీసు

To:
R22: P.Chandrayudu Near Thasildar Office, Kothacheruvu,
R23: P.Muruli Krishna S/o P.Chandrayudu Near Thasildar Office, Kothacheruvu,
R25: P.Aruna W/o Radha Krishna Sreenivasa Degree Collage, Kadiri.

యిందుమూలంగా మీకు తెలియజేయడం ఏమనగా పై నెంబరు దావాలో మిమ్ములను ప్రతివాదులుగా చేర్చుటకు గాను ఆలస్యమైనందున Set aside The abtament కు గాను I.A.No:272/2022 అర్జీని దాఖలు చేసినాము.సదరి విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు 01/08/2024వ తేది ఉదయం 10:30 గం॥లకు మీరు ఖుద్దున గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ వాదనను కోర్టు వారికి తెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు పై అర్జీని తీర్మానము చేయుదురని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

ఆర్. శ్రీకాంత్‌రెడ్డి,
అడ్వకేట్, పెనుకొండ